వైఎస్ఆర్ కడప
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 25 మార్చి 2026



## బుకింగ్ లు ఎక్కువ...
# నిల్వలు తక్కువ

**దువ్వూరు, మార్చి 24, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులో రెండు గ్యాస్ ఏజెన్సీలు ఉండగా వాటిలో రోజు రోజుకు గ్యాస్ వినియోగదారులు బుకింగ్ చేసుకుంటున్నారని అయితే నిల్వలు తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దువ్వూరు మండలానికి సంబంధించి 2 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా ఒక ఏజెన్సీలో 1372 మంది సోమవారానికి గ్యాస్ సిలిండర్లు కావాలని బుకింగ్ చేసుకున్నారు. అయితే ఆ ఏజెన్సీలో అందుబాటులో కేవలం 342 సిలిండర్లు మాత్రమే ఉన్నాయి. వాటిని సోమవారం పంపిణీ చేశారు. ఇంకా 1030 మందికి గ్యాస్ సిలిండర్లు అందవలసి ఉంది. మరొక ఏజెన్సీలో 1030 మంది వినియోగదారులు తమకు గ్యాస్ కావాలని బుకింగ్ చేసుకోగా కేవలం 110 గ్యాస్ సిలిండర్లు మాత్రమే నిల్వ ఉన్నాయి. వాటిని సోమవారం పంపిణీ చేయగా ఇంకా 919 మంది గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ అందవలసి ఉంది. వీరికి గ్యాస్ అందాలంటే 15 రోజుల పైన పడుతుందని గ్యాస్ నిర్వాహకులు తెలిపారు. ఏది ఏమైనా దువ్వూరులో గ్యాస్ కష్టాలు కూడా మొదలయ్యాయని చెప్పవచ్చును.

## మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా జెసి నిధి మీనా

**ప్రొద్దుటూరు, మార్చి 24, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా కడప జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఏఎస్పీ విభూకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహసిల్దార్ గంగయ్య స్వాగతం పలికారు. అనంతరం ఆమె అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో ప్రమాదాలు జరిగి చాలా మంది మరణించడం జరుగుతుందని ఇటీవల ప్రమాదం జరిగి మరణించిన ప్రదేశాన్ని పరిశీలించి ప్రమాదాలు అరికట్టాలంటే రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, బొల్లవరం మున్సిపల్ ప్లాట్లను తొందరగా వేలం వేసి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని, ఎంఐజీ లేఔట్ ను తొందరగా అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సూచనల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్ నిధిమీనాకి మాజీ జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహసీల్దార్ గంగయ్య, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### నియోజకవర్గాల పునర్ విభజనతో
# ఊహించని మార్పులు

**కడప, ప్రొద్దుటూరు, రాయచోటి మహిళలకు**

**నేతల గుండెల్లో గుబులు**

**లక్కిరెడ్డిపల్లి ,వాయల్పాడు మరలా వస్తాయా?**

**ముక్కలయ్యే పార్లమెంట్ నియోజకవర్గం ఏది?**





**రాజంపేట,మార్చి 24 ప్రభాతవార్త**

వచ్చే సార్వత్రిక ఎన్నికల ముందే పార్లమెంట్ ,అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరిగా జరుగుతుందన్న కేంద్రం సంకేతాలతో ఊహించని మార్పులు చోటుచేసుకోనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన నేతల గుండెల్లో గుబులు రేకెత్తిస్తోంది. రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గాల పరిధిలో జరిగే మార్పులు, చేర్పులు నేతల తలరాతను మార్చనున్నాయి. అనుకూలతలు, ప్రతికూలతలు ఏ పార్టీకి క్లిష్టంగా మారుతాయో చెప్పలేము. పునర్ విభజన మార్గదర్శకాలు వెలువడితే కానీ ఈ విషయంలో స్పష్టత రాదు. ఉమ్మడి కడప జిల్లాలోని కడప,రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో ఏది ముక్కలవుతుందో... 2004లో జరిగిన నియోజకవర్గాల పునర్ విభజనలో ఉమ్మడి కడప జిల్లాలో లక్కిరెడ్డిపల్లె, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని వాయల్పాడు అసెంబ్లీ స్థానాలు కనుమరుగయ్యాయి. తాజాగా ఈ రెండు స్థానాలు తిరిగి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా అదనంగా నియోజకవర్గాలు పెరిగే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన కడప రెండు అసెంబ్లీ స్థానాలుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే కడప రూరల్ గా చేస్తారా లేక రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కేంద్రంగా నియోజవర్గం ఏర్పాటు అవుతుందన్న ప్రచారం కూడా కూడా జరుగుతోంది. గతంలో ఈ ప్రతిపాదన ఉందన్న ప్రచారం కూడా జరిగింది. కడప పార్లమెంట్ పరిధిలో కడప ,ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానాలలో ఎక్కువ ఓటర్లు ఉన్నారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మదనపల్లిలో ఎక్కువగా ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుతో ముఖచిత్రం మారే పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఎందుకంటే మదనపల్లె జిల్లా కేంద్రంగా మారింది. ఈ జిల్లా పరిధిలో ప్రస్తుతం మదనపల్లె ,తంబళ్లపల్లె, పుంగనూరు ,పీలేరు రాయచోటి నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఐదు నియోజకవర్గాలతో పాటు కడప జిల్లాలో రాజంపేట ,తిరుపతి జిల్లాలో రైల్వేకోడూరు నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలో సగటున ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అయితే రాజంపేట పార్లమెంట్ స్థానం లాంటి నియోజకవర్గంలలో విభజన, మార్పులు చేర్పులు చేయడం చాలా కష్టంగా మారుతుంది. ఎందుకంటే పార్లమెంట్ నియోజకవర్గం ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజంపేట పార్లమెంటు నియోజవర్గం రెండుగా ముక్కలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓటర్ల సంఖ్యను బట్టి నియోజకవర్గాల పునర్ విభజన జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 శాతం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త నియోజవర్గాలు రానున్నాయి. ఈ కొత్త నియోజవర్గాలు జిల్లా దామాషా ప్రకారం చేస్తారా లేక పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా చేస్తారా అన్నది కూడా మార్గదర్శకాలు వస్తే కానీ స్పష్టత రాదు. ముఖ్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య చాలా తేడాగా కనిపిస్తోంది. అదేవిధంగా పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో అసెంబ్లీ స్థానాల సంఖ్య కూడా తగ్గే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 50 శాతం స్థానాలు పెంచాలంటే అసెంబ్లీలో ఓటర్ల సంఖ్య ,పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అసెంబ్లీ స్థానాల సంఖ్య చాలావరకు తగ్గించడం అనివార్యంగా మారుతుంది. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నాలుగు అసెంబ్లీ స్థానాలు మించి ఉండేటట్లు కనిపించడం లేదు. అలాగే పుల్లలు విభజనతోపాటు పాటు మహిళలకు 33.5!! సీట్లు కేటాయించడం ఖాయమైంది. ఇదే జరిగితే అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం కడప జిల్లాలో 1,32,431 మంది మహిళ ఓటర్లు, ప్రొద్దుటూరు 1,23,509, అన్నమయ్య జిల్లాలో రాయచోటి 1,22, 67 మంది మహిళా ఓటర్లు ఉన్న నేపథ్యంలో ఈ మూడు మహిళలకు కేటాయించే అవకాశం ఉంది.ఏది ఏమైనా అధికార పక్షం పునర్విభజనను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశాలు లేకపోలేదు. గతంలో కూడా వైఎస్ తనకు అనుకూలంగా చాలాచోట్ల పునర్విభజన చేశారు. రాజకీయ శత్రువులకు చెక్ పెట్టారు. కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో పునర్విభజనపై నాడు ఈ కామెంట్ సర్వత్ర జరిగింది కూడా. అందుకు భౌగోళిక పరిస్థితులనో లేక పక్క పక్కనే ఉన్న మండలాలను సాకు గా చూపడం పరిపాటిగా మారింది. అయితే ఈ లెక్కలు ఏ మేరకు అధికారపక్షం తమకు అనుకూలంగా మలుచుకుంటుందో, దాన్ని చూసి ప్రతిపక్షం ఎలాంటి రాజకీయ ఎత్తులు వేస్తుందో వేచి చూడాల్సి ఉంది.

### శ్రీ కోదండ రామాలయంలో
# కోయిలాల్వార్ తిరుమంజనం



**ఒంటిమిట్ట మార్చి 24 ప్రభాతవార్త**

ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 05 వ తేదీ వరకు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు రామాలయంలో అన్ని చర్యలు చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయ టిటిడి అధికారులు కోయిలాల్వార్ తిరుమంజన సేవలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తులకు ఆలయంలోనికి రాగానే సుగంధ పరిమళ సువాసనలు వెదజల్లేందుకు ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుటకు కోయిలాల్వార్ తిరుమంజన సేవలు నిర్వహిస్తారు. ఆలయ టిటిడి డిప్యూటీవో ప్రశాంతి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు సిబ్బంది ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ముందుగా వేకువజామున అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయ అధికారులు తిరుమంజన సేవలకు కావలసిన వస్తు సామాగ్రిని తీసుకొని సాంప్రదాయబద్ధంగా ఆలయంలోకి రావడం జరిగింది. అనంతరం వారు ఆలయంలోని గోడలకు, గర్భాలయము, ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, ఆలయ ప్రాంగణము, ఆలయ పైకప్పు ,పూజా సామాగ్రిని మంచినీటితో శుద్ధి చేశారు.నాముకోపు, శ్రీచూర్ణం, పసుపు, పచ్చాకు, కస్తూరి, గడ్డ కర్పూరము, శ్రీగంధం, కుంకుమ, కిచిలి గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన మిశ్రమాన్ని సంప్రోక్షణ చేయడం జరిగింది. పవిత్ర జలాన్ని ఆలయమంత ప్రోక్షణ చేశారు. అనంతరం ఉదయం 11:30 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ నవీన్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్‌పై సచివాలయ సిబ్బందికి శిక్షణ




**బద్వేలు అర్బన్, మార్చి 24, ప్రభాతవార్త**

బద్వేల్ పురపాలక సంఘ పరిధిలోని సచివాలయ సిబ్బందికి ఒక రోజు పూర్తిస్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మరియు ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం బద్వేల్ పురపాలక కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఈ శిక్షణలో పర్యావరణ, సంక్షేమ మరియు మౌలిక సౌకర్యాల కార్యదర్శులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు చెందిన శిక్షకులు డా. కె. శీనివాసు, శ్రీ కరుణాకర్ సిబ్బందికి శిక్షణ అందించారు. కార్యక్రమాన్ని పురపాలక కమీషనర్ వి.వి. నరసింహా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, ఉత్తమ పద్ధతులను అలవర్చుకుని వృత్తిలో ప్రత్యేక గుర్తింపు సాధించాలని సూచించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఉద్యోగుల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో చర్చలు, ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు శిక్షణను ఆసక్తిదాయకంగా రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

# అరటి రైతుల దుస్థితికి పాలకులే కారణం

**కల్తీ పిలకలు, ఎరువులతో నష్టపోతున్న రైతులు**

**రైతులను దోచుకుంటున్న దళారులు**

**కోల్డ్ స్టోరేజ్ లేమితో నష్టాలు.. వెంటనే పరిహారం ఇవ్వాలి**

**ప్రభుత్వంపై వైయస్ షర్మిల ఘాటు విమర్శలు**



**పులివెందుల, మార్చి 24 , ప్రభాతవార్త :**

అరటి రైతుల దుస్థితి కి పాలకులే కారణం అని కల్తీ పిలకలు, ఎరువులతో రైతులు నష్ట పోతున్నారు అని దళారులు రైతులను దోచుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వం పై ఘాటు విమర్శలు చేశారు. నియోజక వర్గ పరిధిలోని సింహాద్రిపురం మండలంలోని కసనూరు గ్రామంలో ఇటీవల ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి తోటలను మంగళవా రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అరటి తోటను పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, కోల్డ్ స్టోరేజ్ సదుపాయం పూర్తిగా అందుబాటులో ఉంటే రైతులు పంటను నిల్వచేసుకుని సరైన ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉండేదన్నారు. అయితే అలాంటి మౌలిక సదుపాయాల లోపం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నా రు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందు లలో కూడా రైతులను పూర్తిగా విస్మరించారని ఆమె ఆరోపించారు. ధరల స్థిరీకరణ నిధి పేరుతో రూ.3000 కోట్లు ఏర్పాటు చేశామని చెప్పినా, నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా అందలేదని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బడ్జెట్ లో రూ.500 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, ఆ నిధి నుంచి వెంటనే బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అరటి పిలకలు, ఎరువుల కల్తీపై కూడా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలర్లు కల్తీ పిలకలు, ఎరువులు సరఫరా చేస్తూ రైతులను దోచుకుంటున్నారని, ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో పంటలు దెబ్బతిన్నప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేయకపోవడం దురదృష్ట కరమన్నారు. దళారులు సిండికేట్లుగా మారి రైతులను దోచుకుంటున్నారని, ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోందని విమర్శించారు. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ తరఫున రైతులకు అండగా నిలుస్తామని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### మరో నెలపాటు సాగునీరు అందించే
# రైతులను ఆదుకోవాలి

**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి**




**ప్రొద్దుటూరు మార్చి 24 ప్రభాతవార్త**

వేసవి కారణంగా రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరో నెలపాటు సాగునీటిని అందించే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో కేసి కెనాల్ కింద 90 వేల ఎకరాల సాగుభూమి ఉందని, అదేవిధంగా చాపాడు కేనాల్ కింద 19 వేల ఎకరాలు సాగుభూమి ఉందని, కాగా వేసవి కారణంగా పంటలకు నీరు సరిగా అందడం లేదని వివరించారు. మరో నెల రోజులు పంటలకు నీరు అందించాలని తెలిపారు. వెలిగొడు లో ఉన్న 6.4 టీఎంసీ నీటిలో ఒక టీఎంసీ రాజోలి ఆనకట్టకు వదలమని మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. ఉన్న ఫలంగా మైలవరం రిజర్వాయర్ నుంచి 170 క్యూసెక్కుల నీటిని విడుదల చేయమని జిల్లా కలెక్టర్ ను కోరానని, రేపటిలోపు నీటి విడుదల చేస్తారని వివరించారు. ప్రొద్దుటూరు, కడపజిల్లా రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతులెవ్వరూ భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతుల సంరక్షణ కోసం ప్రభుత్వం అన్ని విధాల చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**రాజంపేట టిడిపి ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు**



హస్తవరంలో రైతులతో జగన్మోహన్ రాజు

**రాజంపేట, మార్చి 24 ప్రభాతవార్త**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హస్తవారం గ్రామంలో పర్యటిస్తూ "అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ " రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతుల ఇండ్ల వద్దకే వెళ్లి చమర్తి జగన్ మోహన్ రాజు రైతులతో మాట్లాడారు. రైతన్నలకు అన్నదాత సుఖీభవ నిధులు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.అంతేకాకుండా ప్రస్తుతం రైతులు చేపడుతున్న వ్యవసాయ పనులపై ఆరా తీశారు. అనంతరం పొలాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులతో చమర్తి మాట్లాడి స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఇది మడకల కుమార్, రాజంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ గన్నె సుబ్బనరసయ్య నాయుడు, మండల పార్టీ గ్రామీణ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్, మన్నూరు సింగిల్ విండో చైర్మన్ సుబ్రహ్మణ్యం,వరదయ్యగారి పల్లి సర్పంచ్ హరి, దగ్గుబాటి వెంకటేష్, వెంకట సుబ్బరాజు, సుబ్బరాజు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలు అన్ని రంగాలలో ముందుండాలి

**పులివెందుల , మార్చి 24 ప్రభాతవార్త :**

ఆడపిల్లలు అన్ని రంగాలలో ముందుండాలని జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి పిలుపునిచ్చారు. కెనడా దేశానికి చెందిన ఓటీఎఫ్/ఎఫ్ఈఓ సంస్థ వారి సహకారం తో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో పులివెందుల లోని బాలికోన్నత పాఠశాల లో చేపట్టిన క్రీడా సామగ్రి అందజేత కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొ న్నారు.ప్రధానోపాధ్యాయులు ఏ. సి.గంగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో ఆమె మాట్లాడుతూ బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుని చదువుతో పాటు క్రీడల్లోనూ ముందంజ వేయాలని, ధైర్యంగా మాట్లాడడం నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు మరియు గురువుల కష్టాన్ని గుర్తెరిగి నడచుకోవాలని, చదువును నిర్లక్ష్యం చేయకుండా కోరుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని బాలికల్లో స్ఫూర్తిని నింపారు. బాలికోన్నత పాఠశాలకు రావడంసంతోషదాయకాయకమని, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం తప్పక అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం క్రిష్ణారెడ్డి, శైలజ,సేవాసమితి అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి మస్తాన్ బాషా,సభ్యులు చాంద్ బాషా, వ్యాయామ ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, రమేష్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




### కాలువలో పడి
# వృద్ధురాలు మృతి

**దువ్వూరు, మార్చి 24, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరుకు సోమవారం కేసి కాలువలో పడి రామసుబ్బమ్మ అనే వృద్ధురాలు మరణించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజుపాలెం మండలం వాసుదేవపురం గ్రామానికి చెందిన రామ సుబ్బమ్మకు గతంలో నడుము, ఇతర నొప్పులు ఉన్నందున బాధపడుతూ ఉండేది. అందులో భాగంగా సోమవారం రామసుబ్బమ్మను కోడలు దువ్వూరుకు తీసుకొని వచ్చి ఆర్ఎంపీ డాక్టర్ వద్ద సూది వేయించి మందులు తీసుకుంది. అనంతరం కోడలు బస్టాండ్ లోకి వెళ్లి పండ్లు తీసుకుని వస్తానని నువ్వు వెళ్ళమని చెప్పగా ఆమె వాసుదేవపురం వెళుతూ జీవితంపై విరక్తి చెంది నొప్పులతో బాధపడుతున్నానని గతంలో ఇంటి వద్ద చెబుతూ ఉండేది. అందులో భాగంగా ఇంటికి వెళ్లకుండా కాలువ వద్దకు వెళ్లి తనకు తానుగా కాలువలో పడగా నల్లవాగు వద్ద పొలం వద్ద ఉన్న రైతు కట్ట వెంబడి వెళుతూ వృద్ధురాలి శవం ఇక్కడ ఉందని సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు, బంధువులు వెళ్లి ఆమె మృతదేహాన్ని గుర్తించారు. వాసుదేవపురం కు చెందిన రామసుబ్బమ్మ అని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ఊరేగింపు హద్దుల విషయం పరిష్కారం..



**యర్రగుంట్ల మార్చి 24, ప్రభాతవార్త:**

యర్రగుంట్ల మండల పరిధిలోగల రంగసాయిపురం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఊరేగింపు వేడుకల్లో హద్దుల విషయంలో వివాదం తలెత్తింది. ఈ వివాదాన్ని మంగళవారం యర్రగుంట్ల తహశీల్దార్ అమరేశ్వరి, యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి, ఎస్సై నాగ మురళి తమ సిబ్బందితో కలిసి సామరస్యంగా ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపారు. దీంతో ఆ గ్రామంలోని ప్రజలు ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించడంతో అధికారులకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.

# ట్రాఫిక్ నిభందనలు ఉల్లంఘిస్తే చర్యలు..

**వేంపల్లె:మార్చి24(ప్రభాత వార్త )**

ట్రాఫిక్ నిభందనలు తప్పనిసరి పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహన పత్రాలు, లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరి కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిభందనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బద్వేలు, మార్చి 24, ప్రభాత వార్త

బద్వేలు మండలంలోని గూడెం సమీపంలో మంగళవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని కలిగించింది. మృతుడు గాండ్ల తిమ్మాయపల్లె గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది

## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి



యర్రగుంట్ల మార్చి 24, ప్రభాతవార్త:

అర్హులైన వారికి ఇంటి స్థలం పంపిణీ చేయాలంటూ మంగళవారం సీపీఐ నాయకులు యర్రగుంట్ల తహశీల్దార్ అమరేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులైన వారికి పట్టణంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం తోపాటు రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని ముట్టడి



బద్వేలు, మార్చి 24, ప్రభాతవార్త

అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించడం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడం, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయడం, భూమిలేని వారికి సాగు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బద్వేల్‌లో ఆర్‌డీఓ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేకపోతే గత ప్రభుత్వానికి జరిగిన పరిస్థితి ప్రస్తుత కూటమి ప్రభుత్వానికీ ఎదురవుతుందని హెచ్చరించారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని, అద్దె ఇళ్లలో నివసించే పేదలకు అద్దె సహాయం అందించాలని కోరారు. సీపీఐ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, కార్యవర్గ సభ్యులు వి వీరశేఖర్, పి బాల ఓబయ్య, గంగా సురేష్, మస్తాన్, ఇమ్మాన్యుయేల్, పడిగే వెంకట రమణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3 నుంచి ఉచిత పాలీసెట్ కోచింగ్: జెవివి

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 24, ప్రభాతవార్త

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 వ తేదీ నుంచి పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్టు పాలీసెట్ 2026 కోసం ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపీనాథ్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నంగా రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు ఈ విషయమై స్థానిక నందిని క్లాత్ మార్కెట్ లోని జెవివి ఆఫీసులో పాలీసెట్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమం లో ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉచిత పాలీసెట్ కోచింగ్‌ను ఇవ్వడం అభినందనీయమని, విద్యార్థులు 9705333305 ఫోన్ చేసి అవకాశాన్ని వినియోగించు కోవాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ బెస్ట్ ఫ్యాకల్టీలతో ఈ ఉచిత కోచింగ్ ను నడుపుతున్నట్లు, విద్య ఉచితంగా అందించాలనేదే జనవిజ్ఞాన వేదిక ఆశయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.సునీత, అల్లా బకస్, ఈశ్వరయ్య, రవిబాబు, నరేష్, నాగరాజు, గురు శేఖర్ రెడ్డి, రమణ, మధుసుధన్ రెడ్డి, మురళీ గుప్త, డా. మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, తిరుమలకొండు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే

## క్రిమినల్ కేసు నమోదు చేస్తాం

### మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు

సిద్దవటం మార్చి 24 ప్రభాతవార్త



ప్రభుత్వ రెవెన్యూ పొలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిద్ధవటం మండల తహసిల్దార్ ఆకుల తిరుమల బాబు తెలిపారు. సిద్ధవటం తాసిల్దార్ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ గ్రామ శివారులోని జంగాలపల్లి రెవిన్యూ పొలం సర్వేనెంబర్ 207 లో 25 ఎకరాలు పైబడి ప్రభుత్వ భూమి ఉందని స్థానికులు కొంతమంది ప్రభుత్వ భూమి ఆక్రమించి 3 ఎకరాలు పైబడి మామిడి మొక్కలు నాటినట్లు మా దృష్టికి వచ్చిందని మొక్కలు తొలగింపు చేపట్టిన మరల అదే పొలంలో మొక్కలు నాటడంతో కబ్జాకు గురైన రెవిన్యూ పొలాన్ని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 2 రోజులుగా సర్వే నిర్వహిస్తున్నామని కబ్జాకు గురైన రెవిన్యూ పొలాన్ని నిర్ధారించి మొక్కలు పూర్తిగా తొలగించి ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ రికార్డులో నమోదైన పొలాల్లో మాత్రమే పనులు చేసుకోవాలని ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

## క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన ఆయుధం

సిద్ధవటం మార్చి 24 ప్రభాతవార్త

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక కడప జిల్లా ఆధ్వర్యంలో జెడ్పిహెచ్ఎస్ 11వ పటాలము, భాకరాపేట పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెటాలియన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న డాక్టర్ సుదర్శన్ రెడ్డి విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలు, సంక్రమణ మార్గాలు, చికిత్స లభ్యత, నివారణ చర్యలు వంటి అంశాలను సునిశితంగా వివరి టిబి పూర్తిగా నయమయ్యే వ్యాధి. తొందరగా గుర్తించడం, సరైన మందులు పూర్తి కోర్సు చేయడం అత్యంత కీలకం. విద్యార్థులే రేపటి ఆరోగ్య రక్షకులు అని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్ బాష మాట్లాడుతూ:సామాన్య ప్రజల్లో శాస్త్రీయమైన దృక్పథం అవసరం టిబి వంటి వ్యాధులపై అపోహలు తొలగించడానికి అవగాహన కార్యక్రమాలు అత్యంత ముఖ్యం అని పేర్కొన్నారు:"అబ్బాయిలూ, అమ్మాయిలూ మీ ఇంట్లో, గ్రామంలో గితీ పై అవగాహనను పంచండి. జాగ్రత్తలు తీసుకుంటే టిబిమన నుండి దూరంగా ఉంటుంది. అని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమాన్ని పాఠశాల హెడ్మాస్టర్ పోతులూరయ్య సైన్స్ టీచర్ రవికుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



## తహసిల్దారును సత్కరించిన రేషన్ డీలర్లు..



యర్రగుంట్ల మార్చి 24, ప్రభాతవార్త:

యర్రగుంట్ల తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన అమరేశ్వరి ని మంగళవారం యర్రగుంట్ల మండలంలోని రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీలర్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రమేష్ నాయుడు, కొండారెడ్డి, మదూర్ భాష, మస్తాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ గేట్ వేలం వాయిదా..

యర్రగుంట్ల మార్చి 24, ప్రభాతవార్త:

యర్రగుంట్ల పురపాలక సంఘం 2026, 27 ఆర్థిక సంవత్సరం సంబంధించి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మార్కెట్ గేటు వసూలు వేలం ప్రక్రియను నిర్వహించారు. సర్కారు వారు నిర్ణయించిన ధరకు ఎవరూ పాటపాడనందు వల్ల వేలంపాట వాయిదా వేసినట్లు యర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. ఈ నేపథ్యంలో మార్కెట్ గేట్ వసూలు విషయం మున్సిపల్ ప్రత్యేక అధికారితో చర్చించి తగు నిర్ణయం తెలియజేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

## తహసీల్దారును సన్మానించిన డీలర్లు



పెండ్లిమర్రి, మార్చి 24, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలంలోని డీలర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో డీలర్లు తహసీల్దారు శోభన్‌బాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ పేదలకు సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పంగా చంద్రశేఖర్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి కృషి చేయాలి

పెండ్లిమర్రి, మార్చి 24, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం గ్రామాల్లో శుభ్రంగా ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో వేసవి కాలంలో కాబట్టి తాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. అనంతరం సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ఆధ్వర్యంలో డీలర్ల సమావేశం..



సుండుపల్లె, మార్చి 24,ప్రభాతవార్త :

మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నందు డీలర్ల సమావేశం తహసీల్దార్ లక్షుమమ్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎన్ఫోర్స్మెంట్ డి టి రవికుమార్ మాట్లాడుతూ కార్డు దారులకు సక్రమంగా సరుకులు పంపిణి చేయాలన్నారు. వయో వృద్దులు, వికలాంగులు, మంచానికి పరిమిత మైన వారికి 26 వ తేదీనుండి డీలర్లు వారి ఇంటి దగ్గరకు పోయి బియ్యం సరుకులు ఇవ్వాలన్నారు. కొంతమంది డీలర్లు వారికే కాకుండా మిగతా వారికి కూడా ఇస్తున్నారని అలా చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకొంటామనియు తుకాలు సక్రమంగా ఇవ్వాలన్నారు. శాశ్వత డీలర్లు ఆత రైజేషన్ రెన్యూవల్ చేయుంచుకోవాలని తెలియజేసారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు అందరు క్రమం తప్పకుండ 26 వ తేదీన వృద్ధులు, వికలాంగులకు ఇంటి దగ్గరకు పోయి బియ్యం సరుకులు ఇవ్వాలనియు మరియు 1 వ తేదీ నుండి సరుకులు పంపకం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో డి టి వినీత్ కుమార్ రెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ జోతిర్మయి, డీలర్లు పాల్గొన్నారు.

## మంచినీటి నాణ్యతపై శిక్షణ



దువ్వూరు, మార్చి 24, ప్రభాతవార్త:

మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మంచినీటి నాణ్యతపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. ఈ శిక్షణలో గ్రామాల్లో ప్రజలు వినియోగించే నీరు నాణ్యతా పరంగా ఉందా లేదా వాటిలో ఏ మేరకు కల్తీ ఉంది అనే విషయాలను వివరించేందుకు ఈటిఏ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. నీటిలో 8 విభాగాలు ఉంటాయని ఫ్లోరైడ్, ఐరన్, నైట్రేట్, క్లోరిన్ తదితర వాటిని పరీక్ష చేసి వాటిలో ఎంత శాతం ఉంది మీరు తాగేందుకు ఉపయోగపడుతుందా లేదా అనే విషయాలను పరీక్షి ంచవచ్చు అన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న పంచాయతి కార్యదర్సులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రతి పంచాయతీకి ఒక నాణ్యత కిట్ అందజేస్తారని దాని ద్వారా పరీక్షలు జలపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుధా పాల్గొన్నారు.

## పోలిరెడ్డి అరెస్టు చేయడం దారుణం.

బద్వేల్ అర్బన్ మార్చి 24 ప్రభాతవార్త :



బద్వేల్ జెడ్పిటిసి వంకల చిన్న పోలిరెడ్డి నీ అరెస్టు చేసి బద్వేల్ సబ్ జైల్లో దాదాపు 20 రోజులు గడిచిపోయింది. కూటమి ప్రభుత్వం కేవలము వైఎస్ఆర్సిపి నాయకులను ముఖ్యంగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారిని ఎప్పుడో పాత కేసులు బయటికి తీసి నోటీసులు కూడా ఇవ్వకుండా అరెస్టు చేయడం చాలా దారుణం. ఎప్పుడూ ఒకే ప్రభుత్వం ఉండదు. ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ లో కొన్ని పద్ధతులు ఉంటాయి, ఆ పద్ధతులు పాటించకుండా అన్యాయంగా అరెస్ట్ చేయడం జరిగింది. ప్రెస్ మీట్ లో సింగమాల వెంకటేశ్వర్లు వైయస్సార్ ఎస్సీ సెల్ అధ్యక్షులు, జిల్లా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి బిజవేముల రామసుబ్బారెడ్డి, జిల్లా వైద్య విభాగ కార్యదర్శి దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గండి దేవస్థానం అభివృద్ధికి పాటు పడాలి..



వేంపల్లె మార్చి 24 ప్రభాతవార్త

గండి దేవస్థానం అభివృద్ధికి అందరూ కలిసి పాటు పడాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు గండి క్షేత్రంలో గండి డిసితో, అర్చకులు, మాజీ ఛైర్మన్ వెంకట స్వామితో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి చర్చించారు. హరతి పల్లం కోసం గండిలో గొడవలు చేసుకోవద్దని రామమునిరెడ్డి తెలిపారు. హరతి పల్లం డబ్బులు దేవస్థానంకు చెందాలని భక్తులు కోరడం జరిగిందని తెలిపారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించరాదని కోరారు. అర్చకులు కూడ వారి సమస్యలను తన దృష్టికి, గండి డిసి దృష్టికి తెచ్చారని వాటిని బిటెక్ రవి దృష్టికి తీసుకొని వెళ్తానని చెప్పారు. అర్చకుల సమస్యలను పరిష్కరించాలని డిసిని కూడ కోరడం జరిగిందని చెప్పారు. గండి దేవస్థానంలో పూజారులు తక్కువగా ఉన్నారని కాబట్టి కొందరిని పూజారులుగా పెట్టుకొని వారికి సొంతంగా తామే జీతాలు ఇస్తున్నట్లు గండి అర్చకులు తెలిపినట్లు చెప్పారు. హరతి పల్లం లేకుండా చేస్తామని అయితే పూజారులకు జీతాలు ఇవ్వాలని కోరాడంతో డిసి వారికి జీతాలు వచ్చే విధంగా చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అర్చకులకు పని భారం కూడ తగ్గించాలని కోరడం జరిగిందని వాటిపై కూడ గండి దేవస్థానం అధికారులతో చర్చించడం జరుగుతుందని చెప్పారు. అర్చకులు కూడ న్యాయమైన కోరికలు కోరడం జరిగిందని వాటిని పరిష్కారం చేయాలని డిసిని కోరినట్లు చెప్పారు. గండి దేవస్థానంలో ఎలాంటి గోడవలు చేసుకోకుండా గండి దేవస్థానం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు.

## త్రాగునీటి సమస్య లేకుండా చూడండి

పులివెందుల మార్చి 24, ప్రభాత వార్త :



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసు కోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీవో కార్యాలయంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్డిఓ చిన్నయ్యకు ఆయన వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన ఆర్డీవో తో మాట్లాడుతూ వేసవికాలం ఐనందున పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడగాని తాగునీటి సమస్య తలఎత్తు కొండ అన్ని చర్యలు తీసుకో వాలని ఆర్డీవో ను కోరారు. అలాగే పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించి 15ఫైనాన్స్ కింద సాంక్షన్ అయిన పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. మున్సిపాలిటీలో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కు సంబంధించి నియమ నిబంధనల ప్రకారము రుసుము వసూలుకు తమ సహకారాలు అందించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపాలిటల్ పరిధిలో గేటు వసూలు గేజిట్లో నిర్ణయించిన మేరికే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు.

### గ్రామీణ ,పట్టణ ప్రాంతాల్లో

## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



పులివెందుల మార్చి 24 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో భాగమైన ఇంటి స్థలాలు ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పులివెందుల ఏరియా సమితి ఆధ్వర్యంలో పులివెందుల ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం తెలియజేయడం జరిగింది అనంతరం ఆర్డీవో చిన్నయ్యకి వినతి పత్రం సమర్పించడం జరిగింది .ఈ సందర్భంగా సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలో భాగంగా ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఖర్చు ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంటు, ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో నాలుగు లక్షల రూపాయలు హామీని ఐదు లక్షలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా భూమిలేని నిరుపేద రైతులను గుర్తించి అసైన్డ్ ద్వారా వారికి భూమి పంపిణీ చేయాలని అలాగే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే నెరవేరుస్తామని చెప్పిన రాష్ట్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి కొత్త కాల్వ బ్రహ్మం, సిపిఐ వేముల మండల కార్యదర్శి చాంద్ బాషా, సిపిఐ పులివెందుల పట్టణ నాయకులు సుభాన్ భాష, వీరబోయిన నరేంద్ర, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

### దేశానికే అత్యుత్తమ మోడల్‌గా

## స్మార్ట్ కిచెన్ వ్యవస్థ....

కడప, మార్చి 24 ప్రభాతవార్త:

వైఎస్ఆర్ కడప జిల్లాలో వినూత్నంగా చేపట్టిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల సంక్షేమానికి ఒక మైలురాయిగా నిలుస్తోందని స్మార్ట్ కిచెన్ వ్యవస్థ రాష్ట్రానికే కాక దేశంలోనే ఒక ఉత్తమ నమూనాగా నిలుస్తోందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సగర్వంగా తెలిపారు. సోమవారం న్యూఢిల్లీ ప్రగతి విహార్ లోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్ లో ఈ నెల 23,24 వ తేదీలలో రెండు రోజుల పాటు"నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ సమ్మిట్ 2026" నిర్వహించగా... సమ్మిట్ లో మంగళ వారం 2వ రోజు కార్యక్రమంలో.. వైఎస్ఆర్ కడప జిల్లాలో వినూత్నంగా అమలవుతున్న స్మార్ట్ కిచెన్ ప్రాజెక్ట్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. స్మార్ట్ కిచెన్లతో వైఎస్ఆర్ కడప జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం – విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యార్థుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని అమలు చేస్తున్న ఈ మధ్యాహ్న భోజన పథకం నకు సాంకేతికత సహాయంతో కొత్త దశను చేరుకుంది. స్మార్ట్ కిచెన్ల వినియోగం ద్వారా ఈ పథకం అమలు విధానం పారదర్శకంగా, సమర్థవంతం గా మారి, విద్యార్థుల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకొస్తోందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్లలో పెద్ద మొత్తంలో మధ్యాహ్న భోజన తయారీకి అనుకూలంగా స్మార్ట్ కిచెన్ ని రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగా.. రైస్ , కుకింగ్ మరియు బల్క్ కుకింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్టీమ్ ఆధారిత వంట విధానాన్ని అవలంభించడం ద్వారా పోషక విలువలను కాపాడేందుకు దోహదం చేస్తుందన్నారు. అత్యధిక నాణ్యత ప్రమాణాల ప్రకారం పదార్థాల నిల్వ పూర్తిగా శుభ్రతను పాటించే కిచెన్ పరిసరాలను వినియోగించడం ద్వారా చిన్నపాటి మానవ తప్పిదాలు కూడా తగ్గి,ప్రతి రోజు ఒకే స్థాయి నాణ్యతతో భోజనం తయారు చేయడం జరుగుతోందన్నారు. స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం అందడమే కాకుండా.. స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించ గలుగుతున్నామన్నారు. వారికి శిక్షణ ఇచ్చి కిచెన్ కార్యకలాపాల్లో భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గ్రామీణ ఆర్థికాభివృద్ధి కి కూడా దోహదం జరుగుతోందన్నారు. ఈ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ అమలు ను పర్యవేక్షించేందుకు ఆధునిక డిజిటల్ వ్యవస్థలు అమలు చేస్తున్నామని, బిశిళీ ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలు, కిచెన్ కార్యకలాపాలు మానిటరింగ్ చేయడం వల్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచ గలుగుతున్నామన్నారు. 2025 సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించబడిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థ.. ప్రస్తుతం జిల్లాలోని నాలుగు మండలాల్లో 5 స్మార్ట్ కిచెన్లు, 13 వాహనాల ద్వారా 133 పాఠశాలల్లో 10,512 మంది విద్యార్థులకు మధ్యాహ్న బడి భోజనాన్ని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. స్మార్ట్ కిచన్ల ద్వారా ఇప్పటివరకు 9,33,232 భోజనాలను విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 33 మండలాలలో స్మార్ట్ కిచెన్ విధానం ను అమలు చేసేందుకు నిర్మాణ పనులు త్వరితగతిన జరుగు తున్నాయని,మరో మాసంలో పనులను పూర్తి చేసి వాటిని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తిని వ్యక్తం చేయగా.. వైఎస్ఆర్ కడప జిల్లాలో విజయవంతంగా అమలు అవుతున్న ఈ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని మరింత విస్తరించేందుకు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మొగ్గుచూపుతున్నాయన్నారు. జిల్లా యంత్రాంగం సంకల్పానికి సాంకేతికత, ప్రభుత్వ సహకారం, సమర్థవంతమైన అమలు మొదలైన మూడింటి కలయికతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం నిర్వహణ.. ఒక విజయగాథగా నిలిచిందన్నారు. ఇది కేవలం భోజన పథకం మాత్రమే కాదని, ఇది విద్యార్థుల ఆరోగ్యానికి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ వివరించారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

బద్వేలు, మార్చి 24 (ప్రభాతవార్త):

బద్వేలు పట్టణంలో గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న కాశి, సికిందర్లను మంగళవారం పోరుమామిళ్ల బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం, సెల్ఫోన్, 600 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఆంజనేయ స్వామికి విశేష పూజలు

బద్వేలు అర్బన్, మార్చి24, ప్రభాతవార్త



పట్టణంలోని సిద్దవరం రోడ్డులో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం వీరేశచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకు పూజ, సింధూర అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించారు ప్రత్యేక అభిషేక దాతలుగా డాక్టర్ సత్యప్రసాద్ సతీమణి హరిత ,చక్క శివ శంకర్ రెడ్డి సతీమణి సురేఖ కుటుంబ సభ్యులు పాల్గొనగాప్రత్యేక ఉభయ దాతలు గా మదుల పల్లి రవికుమార్ సతీమణి స్వర్ణ కుమారి కుటుంబ సభ్యులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### జనగణనలో ఖచ్చితత్వం,

## ప్రమాణాలను తూచా పాటించాలి





కడప, మార్చి 24 ప్రభాతవార్త: :

సమాచారం సేకరణలో ఖచ్చితత్వం మరియు ప్రమాణాలను పాటించే విధానాలపై దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి మరియు జిల్లా గణన అధికారి విశ్వేశ్వర నాయుడు ఫీల్డ్ ట్రైనర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో భారత సెన్సస్–2027 జనగణన కార్యక్రమంకు సంబంధించి నిర్వహణకు సంబంధించి.. మూడవ స్థాయి శిక్షణలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లకు 2వ రోజు శిక్షణ కార్యక్రమానికి డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. మే 1 నుండి 30 వరకు నిర్వహించనున్న జిల్లాలో జరగనున్న సర్వేకి సంబంధించి ఫీల్డ్ ట్రైనర్స్ కు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 2027 జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన మరియు రెండవ దశలో జనాభా గణన నిర్వహించబడుతుందన్నారు. రెండవ దశలో కుల గణన కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశను మే 1 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణలో జనాభా గణన జిల్లా ఇంచార్జి మరియు మాస్టర్ ట్రైనర్ మోహన్ రమణ మాట్లాడుతూ.. మూడవ దశ శిక్షణలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన సెషన్‌లో, గృహ జాబితా మరియు గృహ గణనలో అడగబోయే మొత్తం 34 ప్రశ్నలను ఫీల్డ్ ట్రైనర్లకు విశదంగా వివరిస్తూ, సమాచారం సేకరణలో ఖచ్చితత్వం మరియు ప్రమాణాలను పాటించే విధానాలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2027 జనాభా గణనను సమగ్రంగా డిజిటల్ విధానంలో నిర్వహించాలన్నారు. అదే విధంగా, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ యాప్ యొక్క ముఖ్య ఫీచర్లు, వినియోగ విధానం పై సమగ్ర అవగాహన కల్పించారు. స్వీయ గణన విధానపు ప్రాముఖ్యతను, దాని ద్వారా సమయపాలన, ఖచ్చితత్వం, పారదర్శకత వంటి ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో సెన్సెస్ ఆఫ్ ఇండియా విభాగం నుండి ప్రత్యేక అధికారుల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించే జనగణన సర్వే నిర్వహణపై జిల్లా, మున్సిపల్, ఛార్జ లెవెల్ సెన్సెన్ సర్వే నిర్వాహకులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. 15 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జన గణన కార్యక్రమం 2027 ఇప్పటి వరకు 16 గణాంక సర్వేగా నమోదవుతుందన్నారు. స్వాతంత్ర్యానంతరం 1952 మొదటగా ప్రారంభం కాగా ప్రస్తుతం 8వ జన గణన కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతోంది. రూ. 13 వేల కోట్ల అంచనా వ్యయంతో.. 16 ప్రాంతీయ భాషల్లో డిజిటల్ విధానంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. కాగా మాస్టర్ ట్రైనర్లు ప్రొఫెసర్లు శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, ఆదిలక్ష్మి, ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనగణన ఇన్‌చార్జ్ మోహన్ రమణ, డిప్యూటీ కలెక్టర్ కిరణ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో "కూటమి" చిత్తశుద్ధేది ?

### పిఆర్సీ అమలు, బకాయిల చెల్లింపులో జాప్యమెందుకు

### రిలే దీక్షలో యుటిఎఫ్ నేత మాదన విజయ కుమార్, జేఏసీ నేత నరసింహారెడ్డి నిలదీత

బద్వేలు అర్బన్ మార్చి 24 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి లేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్, ఏపీ జెఎసి బద్వేలు తాలూకా కన్వీనర్ నరసింహారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్సీని అమలు చేయాలని, ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించాలని, పెండింగ్ డిఏలను విడుదల చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం తాలూకా కేంద్రాలలో రిలే దీక్షల కార్యక్రమంలో భాగంగా బద్వేలులోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, ఏపీ జెఎసి బద్వేలు తాలూకా ఛైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు అనేక హామీలనిచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అధికారం చేపట్టగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను రోడ్ మ్యాప్ ప్రకటించి ఆరు నెలలలోగా చెల్లిస్తామని, పెండింగ్ డిఏ లను విడుదల చేస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఆర్భాటంగా హామీలిచ్చారన్నారు. కూటమి నేతల మాటలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే ఉద్యోగుల అండదండలతో గద్దెనెక్కిన కూటమి పెద్దలు ఉద్యోగుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లు కావస్తున్నదని, కనీసం ప్రభుత్వం పిఆర్సీ కమిషన్ ను నియమించేందుకు ప్రయత్నించడం లేదని విమర్శించారు. డిఏలు చెల్లించకపోతే ఉద్యోగులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో అప్పటి ప్రభుత్వాన్ని నిలదీసిన కూటమి పాలకులు మూడు డీఏలను పెండింగ్‌లో ఉంచిన సంగతి మర్చిపోయారా అని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 12వ పిఆర్సిని ఏర్పాటు చేయడంతో పాటు పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఆర్థిక బకాయిలతో పాటు పెండింగ్ డిఏలను విడుదల చేయాలని వారు డిమాండ్



చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్ 1, 2 తేదీలలో జిల్లా కేంద్రంలో, ఏప్రిల్ 15 నుండి 19 వరకు రాష్ట్ర కేంద్రంలో రిలే దీక్షలను చేపడతామని, అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే ఏప్రిల్ 28 తేదీ ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించి సెక్రటేరియట్ ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. దీక్షలకు ఎన్జీవోలు, పెన్షనర్స్ అసోసియేషన్, సిఐటియు, డివైఎఫ్ఐ, డాక్టర్స్ అసోసియేషన్, కెవిపిఎస్, వైద్య, ఆరోగ్య సిబ్బంది సంఘాల నాయకులు దీక్షలకు మద్దతు తెలియజేస్తూ సంఘీభావంగా దీక్షలలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.సుధాకర్, కె.చెన్నయ్య, ఎ.డి.దేవ దత్తం, కె.ప్రసాద్, అకడమిక్ సెల్ జిల్లా కన్వీనర్ వీరదాసరి క్రిస్టఫర్, ఎన్జీవో అసోసియేషన్ తాలూకా సెక్రెటరీ జి.శివరామిరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.పిచ్చయ్య, రామ సుబ్బారెడ్డి, డాక్టర్స్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు రాజేష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అసోసియేషన్ నాయకులు వెంగయ్య, యుటిఎఫ్ నాయకులు ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, ఎం.రామ చంద్రయ్య, ఆర్.ఈశ్వరరావు, కొండయ్య, ఎ.లాజరయ్య, బి.ఓబన్న, వై.రామయ్య, ఎ.మేరి జయశీల, ఎస్.మున్నీ, ఉదయ్ కుమార్, ఆర్.రాజా, కె.క్రిష్ణయ్య, పి.వి.చంద్రశేఖర్, ఎస్ మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ఫోరం



వీరపునాయునిపల్లి మార్చి24 ప్రభాతవార్త :

మండలంలోని ఉపాధి కార్యాలయం నందు మంగళవారం 2024,25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనుల యొక్క ఓపెన్ ఫోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి పిడి ఆదిశేషారెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి తెలిపారు అదేవిధంగా వారి యొక్క హాజరును నమోదు చేయాలని తెలిపారు దాదాపు 12 కోట్లు రూపాయల ఈ సంవత్సర కాలంలో కూలీలకు మెటీరియల్ కాంపొండ్ కింద చెల్లించినట్లు తెలిపారు ఈ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో సోషల్ ఆడిట్ సిబ్బంది ఇందులో 32వేల 610 రికవరీ రాసినట్లు ఏపీవో తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీడి, జిల్లా విజిలెన్స్ అ,ధికారి ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి..

## నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలి




కడప కార్పొరేషన్ మార్చి 24 ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక యువకులకు ఉద్యోగ ఇవ్వలేదని, ఉద్యోగాల తొలగిస్తున్నారని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని వైసిపి యువజన విభాగ కడప జిల్లా అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య విమర్శించారు. మంగళవారం కడప వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదిత్య మాట్లాడుతూ యువకులకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో నిరుద్యోగశాతం 5.2 ఉంటే ఏపీలో మాత్రం 8.2 శాతం ఉంది అన్నారు. పురుషులు 7 శాతం, మహిళల్లో 10 శాతం నిరుద్యోగత యువత ఉందన్నారు. గత జగన్ పాలనలో 6.42 ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మద్యం షాపులో ఉన్న 18 వేల మంది, రేషన్ షాపులో ఉన్న 12,000 మందిని తొలగించారనీ విమర్శించారు. మొత్తం 10 వేల మందిని తొలగించారు. వాలంటరీ వ్యవస్థలో ఉన్న 1.36 వేల మందిని తొలగించారు. కానీ శాసనసభలో 6 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం చంద్రబాబు అబద్ధాలు చెప్పారన్నారు. ఎన్నికల్లో చెప్పిన హామీలో నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వలేదని మండిపడ్డారు. మూడు విడుదల జరిగిన బడ్జెట్లో కేటాయించ లేదన్నారు. నిరుద్యోగులకు రూ. 22 వేల కోట్లు ఇవ్వాలని కోరారు. మోసం చేయటం బాబు నైజం అన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా యువజన విభాగం ఉపాధ్యక్షుడు రహమతుల్లా ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రహీం, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శివారెడ్డి, వాలంటరీ విభాగం నగర అధ్యక్షుడు బండారు వంశీ, విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి మంచాల శ్యామ్ పాల్గొన్నారు.

## సమావేశం రద్దు డ్రామా..

## అవినీతి కప్పిపుచ్చే మేడా ప్లానా..?



నందలూరు, మార్చి 24 ప్రభాతవార్త:

మండల సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా రద్దు కావడం రాజకీయంగా దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంపై టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తీవ్ర స్థాయిలో స్పందిస్తూ, ఎంపీపీ మేడా భాస్కర్ రెడ్డి పన్నిన కుట్ర ఫలితంగానే సమావేశం నిలిపివేశారని ఘాటుగా ఆరోపించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాల్సిన కీలక వేదికను అకస్మాత్తుగా రద్దు చేయడం వెనుక భారీ అవినీతి బాగోతాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం ఉందని ఆయన మండిపడ్డారు. తాను సమావేశానికి హాజరవుతానని తెలిసి మండలంలో వైసీపీ నేతలు, మేడా సోదరులు చేసిన అక్రమాలు బహిర్గతమవుతాయన్న భయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని తీవ్ర విమర్శలు చేశారు. జడ్పిటిసిలు, ఎంపిటీసీలు, సర్పంచులు, అధికారులకు సమాచారం ఇచ్చి, సింగిల్ విండో ఛైర్మన్‌ను మాత్రం పక్కనపెట్టడం యాదృచ్ఛికం కాదని, ఇది స్పష్టమైన రాజకీయ పన్నాగమని చమర్తి పేర్కొన్నారు. ఇంకా ఘాటుగా స్పందిస్తూ వైసీపీ నేతల అక్రమాలకు కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారని వారు ప్రభుత్వానికి పనిచేస్తున్నారా లేక వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అక్రమాలు, దౌర్జన్యాలకు తావులేదని హెచ్చరిస్తూ ఇకపై ఎవ్వరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే తమ వైఖరి మార్చుకుని నిష్పక్షపాతంగా వ్యవహరించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నందలూరులో జరుగుతున్న అక్రమాలను త్వరలోనే పూర్తిగా బహిర్గతం చేస్తామని చమర్తి జగన్ మోహన్ రాజు వెల్లడించారు.

## స్వయం సహాయక సంఘ సభ్యులకు పెరటికోళ్ల పంపిణీ

బద్వేలు అర్బన్, మార్చి 24, ప్రభాతవార్త



బద్వేలు మండలంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు పెరటికోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 45 యూనిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఒక్కో యూనిట్ ధర రూ. 3,700 కాగా, ప్రతి యూనిట్‌కు 10 కోళ్లు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు సహాయపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగభూషణం, స్థానిక నాయకులు, వెలుగు ఏపీఎం బాలస్వామి, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

## జిల్లా ఉపాధ్యక్షుడిగా గాజులపల్లి శివారెడ్డి.

గోపవరం. మార్చి 24. ప్రభాతవార్త.



బి. కోడూరు మండలం ఐత్రం పేట గ్రామానికి చెందిన గాజులపల్లి శివారెడ్డిని బిజెపి కిసాన్ మోర్చా కడప జిల్లా ఉపాధ్యక్షుడిగా బిజెపి కిషన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షుడు అన్నపురెడ్డి అశోక్ కుమార్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఎంతో బాధ్యతాయుతమైనటువంటి రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నన్ను నియమించినందుకు బిజెపి జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు తిప్పలూరి రామసుబ్బారెడ్డి , బి కోడూరు మండల అధ్యక్షుడు పోలుబోయిన రవిచంద్ర , బిజీ వేముల భాస్కర్ రెడ్డి భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నేటి నుండి రైతు సమస్యల పట్ల,ప్రజా సమస్యల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజా సమస్యలు జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. భారతీయ జనతా పార్టీ నాకు నిర్దేశిస్తున్నటువంటి ప్రతి కార్యక్రమం లోనూ చురుగ్గా పాల్గొని పార్టీ అభివృద్ధికి నూరు శాతం కృషి చేస్తానని గాజుల పల్లి శివారెడ్డి తెలిపాడు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నాగిశెట్టి సుప్రజ పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి భగత్ సింగ్

ఎడ్యుకేషన్ మార్చి 24 ప్రభాతవార్త :




పీడీఎస్‌యు ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం కడప ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న పాల్గొని, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల త్యాగాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. సమానత్వం, స్వేచ్ఛ కోసం వారు చేసిన పోరాటం నేటి సమాజానికి మార్గదర్శకమన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ, నిరపరాధ ప్రజలపై యుద్ధ చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుస్తున్న భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించే దిశగా మార్చి 23 నుండి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి సభలు, కాగడాల ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా నగర నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి కౌన్సిలర్లను సన్మానించిన పుట్టా




మైదుకూరు, మార్చి 24, ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైదుకూరు మున్సిపాలిటీ టిడిపి కౌన్సిలర్లు పదవీకాలం పూర్తి అయిన సందర్భంగా శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైదుకూరు వైపు చూసేలా మున్సిపల్ ఎన్నికల్లో టిడిపికి 12 సీట్లు వైసిపికి 11 సీట్లు వచ్చాయి. తెలుగుదేశం కౌన్సిలర్లు 12 మంది గెలుపొంది మెజార్టీ సాధించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలు తెలుగుదేశానికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి చూపించారు. తెలుగుదేశం తరపున రాష్ట్రంలో కేవలం రెండు చోట్ల తాడిపత్రి, మైదుకూరు గెలుపొందారు. అయితే ప్రజలు గెలిపించిన వైసీపీ నాయకుల దౌర్జన్యంతో టిడిపి కౌన్సిలర్లు ఎన్నో ఇబ్బందులు పెట్టి అక్రమ కేసులు బనాయించి మైదుకూరు టిడిపి కౌన్సిలర్ అక్రమంగా తీసుకెళ్లి ప్రలోభాలు పెట్టి వైసిపి గెలుపొందిన టిడిపి తరఫున ధనపాల జగన్ అభ్యర్థిగా నిలబడి ఎన్ని ప్రలోభాలు పెట్టిన టిడిపి కౌన్సిలర్లు గట్టిగా నిలబడ్డారని కొనియాడారు.ఐదవ వార్డు కౌన్సిలర్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం ఈ శుభ సందర్భంగా మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు.

## త్రాగునీటి సమస్య రాకుండా చూడాలి : ఎంపీపీ

వీరపునాయునిపల్లి మార్చి24 ప్రభాతవార్త :




మండలంలోని ఎంపీడీవో ఆఫీసు నందు మంగళవారం ఎంపీపీ రఘునాథరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలో కూడా ప్రస్తుత వేసవి కాలంలో త్రాగునీటి సమస్య రాకోకుండా చూడాలని అధికారులకు తెలిపారు అదేవిధంగా అధికారులు కూడా ఈ వేసవికాలంలో త్రాగునీటి సమస్య రాకోకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు అనంతరం అధికారులు తమ శాఖల యొక్క ప్రగతి నివేదికలను చదివి సభ్యులకు వివరించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సర్పంచులు ఎంపిటీసీలు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి: ఎస్పై



నందలూరు, మార్చి 24 ప్రభాతవార్త :

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని ఎస్పై మల్లికార్జున రెడ్డి సూచించారు. కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లా కళాజాగృతి బృందం ఇన్‌చార్జ్ నరసరాం ఆధ్వర్యంలో మండలంలోని లేబాక గ్రామంలో సోమవారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్షన్ ప్రభావం, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. కళాజాగృతి బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పట్టాభికి కాలమే బుద్ధి చెబుతుంది..



కడప కార్పొరేషన్ మార్చి 24 ప్రభాతవార్త:

స్వచ్ఛ్ ఆంధ్ర ఛైర్మన్ పట్టాభి సీతారాంకు కాలమే బుద్ధి చెబుతుందని వైసిపి కడప జిల్లా డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు గుంటి నాగేంద్రలు పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా కార్యకర్తల మధ్యలో పట్టాభి దిష్టిబొమ్మతో గాడిదపై ఊరేగించి పెట్రోల్ పోసి దిష్టిబొమ్మ తగలబెట్టారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ వైకాపా అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి పట్టాభి మాట్లాడడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పరుష పదజాలంతో వైయస్సార్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన సందర్భంలో సీఎం సీట్ కోసం జగన్ సంతకాల సేకరణ చేశాడని చెప్పడం నాకేం కాదన్నారు. ఈ విషయంపై మాజీ మంత్రులు వివరణ ఇచ్చారనీ గుర్తు చేశారు. అభివృద్ధిపై చెయ్యకుండా అబద్దాలతో, ప్రతిపక్షాల పై విమర్శలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి 2029లో కాలమే సమాధానం చెబుతుందన్నారు. అలాగే జనసేన పార్టీ మహిళా సుభాషిని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టీయుసి నగర అధ్యక్షుడు నాగరాజు, మాజీ కార్పొరేటర్ సుబ్బరాయుడు, కంచుపాటి బాబు, సత్యం, నరసింహ ,సాయి, పవన్, ఖాదర్ పాల్గొన్నారు.

## కొసినాపల్లె గ్రామంలో ఆవుల పబ్బము...

ముద్దనూరు,మార్చి 24, ప్రభాతవార్త :



మండల పరిధిలోని కొసినాపల్లె గ్రామంలో 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పాలేటమ్మ గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.శుక్రవారం ఉదయం గ్రామదేవతను ప్రత్యేక అలంకరణ, ఒంటి కొమ్ము బుల్లి ఆవు గ్రామంలో తిరుగుట, కాటమరాజు కథ మొదలైనటువంటి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలం మరియు చుట్టుపక్క గ్రామాల వారు స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని గ్రామస్తులు కోరారు.

## సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోండి

ముద్దనూరు, మార్చి 24, ప్రభాతవార్త:



మండలంలోని కొత్తపల్లి గ్రామంలో భూ వివాదంపై రాబడిన సమాచారం మేరకు మంగళవారం సిఐ నగేష్ బాబు ఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాల వారికి సివిల్ సమస్యలను కోర్టు ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరైనా గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు పోలీసు యంత్రాంగం తీసుకుంటుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## నేడే ఉచితంగా బ్రహ్మంగారి మాల ధారణ

బ్రహ్మంగారిమఠం మార్చి 24 ప్రభాతవార్త :



జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి మాలధారణ వేసే భక్తులకు మహా నివేదిన మందిరం నుండు మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మాలధారణ వేసే భక్తులకు రెండు పంచలు, ఒక టవాల, తులసి మాల, పాటిక మాల, విభూది, కుంకం, గంధంను ఉదయం 630 గంటలకు ఉచితముగా అందిచబడును. 32 రోజు మాల వేయు భక్తులకు 25 వ తేదీనా, మరియు 21 రోజు మాలధారణ వేసే భక్తులకు ఏప్రిల్ 6 వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు కోనేటి వీర నాగరాజు, పసుపులేటి వెంకటసుబ్బయ్య, కురాకు సుబ్బారాయుడు, బొమ్ము పెద్ద హజరత్‌రెడ్డి, 9441154890, 9542233115, 9160331892, 7331151971, సంప్రదించ వలసినదిగా తెలిపారు.

## క్షయ వ్యాధిని గుర్తిద్దాం.. అంతం చేద్దాం

సుండుపల్లె, మార్చి 24,ప్రభాతవార్త :



మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా డాక్టర్ శేఖర్ రెడ్డి మరియు డాక్టర్ రూబీనా ఆధ్వర్యంలో అవగాహనా శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని శేఖర్‌రెడ్డి తెలియజేసారు. ఆయన మాట్లాడుతూ 1882 సంవత్సరం రాబర్ట్ కాక్ మైకాబాక్ట్రీయ ట్యూబర్క్యులోసిస్ బాక్టీరియా క్రిమిని కనుగొన్నాడు. ప్రతి సంవత్సరం మార్చి 24 క్షయవ్యాధి దినోత్సవ వం జరుపుకొంటామన్నారు. రెండు వారల పైబడి దగ్గు, సాయం కాలం జ్వరం రావడం,ఆకలి మందగించడ, బరువు దగ్గడం,ఛాతిలో నొప్పి రావడం, దగ్గినపుడు గళ్ళ తో పాటు రక్తం పడడం,ఇవి టిబి లక్షణాలుగా గమనించాలన్నారు మరియు టీబీ వ్యాధి ఊపిరితిత్తులకు కూడ సోకిందను కోవాలన్నారు. శరీరంలో ఇతర భాగాలకు కూడా జబ్బు వచ్చేఅవకాశం ఉందని తెలియజేశారు. ఈ లక్షణాలు ఉన్నపుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గళ్ళ పరీక్ష చేసుకొని జబ్బు నిర్దారణ అయితే ఉచితంగా మందులు ఇవ్వబడును అని తెలియజేసారు. మరియు X-ray ద్వారకూడా నిర్దారణ చేస్తారు 6 నెలలు మందులు వాడితే పూర్తిగా నయం అవుతుందని మరియు ఫోసకాహారం కొరకు 500 ఇవ్వబడునన్నారు. ఈ కార్యక్రమం నందు ఏంపిఇహెచ్ఒ వీర నారాయణ,స్టాఫ్ నర్స్ అనూష, హేమ, ఫార్మసిస్ట్ నటేష్,సిహెచ్ఒ ప్రేమ లత, సాల్మహన్, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్,ఎఎన్ఏం మెహరన్ బీ, సౌజన్య మరియు ఆశాలు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే

మైదుకూరు, మార్చి 24, ప్రభాతవార్త:

మైదుకూరు పట్టణంలోని పాతూరులో వెలసిన కోదండ రామాలయం నందు 24,25 తేదీన వినాయకుడు,సరస్వతి దేవి ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమానికి శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ రావడం జరిగింది. ఆయన రాకతో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మేళతాళాలతో దేవాలయం వరకు స్వాగతం పలికారు. అనంతరం ప్రతిష్ట విగ్రహాలకు పూజలు నిర్వహించి పాల రాతి విగ్రహాల శ్రీ సీతారాముల వారిని దర్శించుకుని సందర్శించారు. టిడిపి నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, శ్రీనివాసులు (వాసు) ఆధ్వర్యంలో శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మరియు పలువురిని శాలువాలతో సత్కరించారు. అనంతరం యాపరాల చిన్న ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లి కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్,బి.ఎన్ నాగేశ్వరి (16వ వార్డు కౌన్సిలర్), గుండం రాజు సుబ్బయ్య, యాపరాల లక్ష్మీనారాయణ, బెల్లం బుజ్జి,సర్వేయర్ బుజ్జి,చిగురుపాటి సుబ్బరాయుడు, బండి అమర్నాథ్, బండి రమణ, శీలం.సతీశ్ కుమార్, ఆలయ కార్య నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## మద్యం వాహనం బోల్తా

నందలూరు, మార్చి 24 ప్రభాతవార్త :



కడప–చెన్నై జాతీయ రహదారిలో మద్యం లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఆవులు అడ్డం రావడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో మద్యం సీసాలు పగిలినా, వాహనంలో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## ఆడపూరులో మలేరియా అధికారిణి తనిఖీ

నందలూరు, మార్చి 24 ప్రభాతవార్త :



మండలంలోని ఆడపూరు గ్రామాన్ని కడప జిల్లా మలేరియా అధికారి మనోరమ మంగళవారం సందర్శించారు. గత కొద్ది రోజులుగా జ్వరం, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆమె, ఇంటింటి లార్వా, ఫీవర్ సర్వేలను తనిఖీ చేశారు. దోమల నివారణ కోసం"ఫ్రైడే డ్రైడే" పాటించాలని, నీటి నిల్వలను తొలగించాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే పిహెచ్‌సీకి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ డాక్టర్లను అభినందించారు.

## ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు



బ్రహ్మంగారిమఠం మార్చి 24 ప్రభాతవార్త :

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో త్రాగునీటి నాణ్యత పై ఫీల్డ్ టెస్ట్ కిట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో తో పాటు మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, మండల పరిషత్ పరిపాలన అధికారి నరసయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ముడుమాల సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి ప్రారంభ దశలో గుర్తిస్తే నివారించవచ్చు..

యర్రగుంట్ల మార్చి 24, ప్రభాతవార్త:

క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ గురించి ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని యర్రగుంట్ల ప్రభుత్వ ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం లో భాగంగా మంగళవారం స్థానిక రాణి వనం ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థులకు క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి నయం అయ్యే వ్యాధి అని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే నియంత్రించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఇబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# క్షయ వ్యాధిని దేశం నుండి నిర్మూలిద్దాం



**బద్వేల్ అర్బన్ మార్చి 24 ప్రభాతవార్త :**
క్షయ వ్యాధిని దేశం నుండి నిర్మూలిద్దామని తొట్టిగారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేష్ అన్నారు, ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం బద్వేలు ఎన్జీవో హోం నందు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వేడుకలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్ మరియు ఎంఎటిసి డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. అనంతరం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు రావడం గళ్ళలో రక్తపడడం చాతిలో నొప్పి ఆయాసం రావడం సాయంకాలం జ్వరం రావడం ఆకలి మందగించడం బరువు తగ్గడం రాత్రిపూట ఉన్నట్టుండి ఒక్కసారిగా చెమటలు పట్టడం గొంతు దగ్గర వాపు వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి కావచ్చు అన్నారు, కావున అలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల్ల పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు, గళ్ళ పరీక్షలో వ్యాధికారిక క్రిమి ఉన్నట్లయితే వెంటనే ఆరు నెలల పాటు చికిత్స ప్రారంభిస్తారని అలాగే మందులు ఆరు నెలలు పాటు క్రమం తప్పకుండా ఆశా కార్యకర్తల ద్వారా రోగి ఇంటి వద్దనే మ్మిగిస్తారన్నారు, చికిత్స కాలంలో వ్యాధిగ్రస్తునికి పౌష్టికాహారం కొరకు నెలకు 1000 చొప్పున వారి బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు, మందులు చికిత్స కాలంలో పూర్తిగా మింగడం వల్ల వ్యాధి నయం అవుతుందని దాని వలన ఎటువంటి భయాందోళన అవసరం లేదన్నారు, వ్యాధిగ్రస్తుడు మద్యం, పొగాకులాంటి వ్యస నాలకు దూరంగా ఉండాలన్నారు, వ్యాధిగ్రస్తుల ఇంట్లో వారందరికీ గల్ల పరీక్ష చేయించుకోవాలని అలాగే చుట్టుప్రక్కల వారికి గల పరీక్ష చేయించాలన్నారు, ఈ రకంగా వ్యాధిని ముందే గుర్తించడం వలన చికిత్స ప్రారంభించి క్షయ వ్యాధి ఒకరి నుండి మరొకరికి రాకుండా నిర్మూలించవచ్చు అన్నారు, ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వైద్యాధికారి శరత్చంద్ర సురేంద్ర నగర్ వైద్యాధికారి శ్రీనివాసులు, మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి హెల్త్ సూపర్వైజర్ శివరామిరెడ్డి క్షయ వ్యాధి పర్యవేక్షకులు నరసింహ ప్రసాద్ బ్రహ్మారెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ వెంగయ్య, పిహెచ్‌హెచ్ఎన్ వెంకటమ్మ మరియు టీవీ యూనిట్ సిబ్బంది మరియు ఐసిటిసి సిబ్బంది గాంధీనగర్ సురేంద్ర నగర్ కోటవీధి పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొని నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది.

# అధికారులూ ఆలోచించండి..

**సుండుపల్లె, మార్చి 24,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని ఎగువ మాలపల్లె కు చెందిన దళిత రైతులు దాదాపుగా 70 సంవత్సరాల నుండి రాతి చెరువులో పంటలు పండించు కొంటూ జీవనం సాగిస్తున్నామని,కొందరు రాజకీయ దురుద్దేశంతో మాపై కక్ష కట్టి చెరువును ఆక్రమించు కొంటున్నారనియు, ప్రభుత్వ భూములు అక్రమణకు గురివుతున్నాయని మమ్ములను ఇబ్బంది పెడుతున్నారని గ్రామ ప్రజలు మండల తహసీల్దార్ లక్షుమమ్మకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి చెరువులు,వాగు, వంక ,తోపు, అన్ని ప్రభుత్వ భూములను ఎంతోమంది ఆక్రమించు కొని సాగుచేసుకొంటున్నారని వారి మీద లేని వివక్ష భూములు లేని దళితుల మైన మామీద ఇంత వివక్ష అధికారులూ అలోచించి మాకు న్యాయం చేయండి అని వినతి పత్రంలో తెలియజేసారు.



## నారాయణ పాఠశాలలో

# గ్రాడ్యుయేషన్



**బద్వేల్ మార్చి 24 ప్రభాతవార్త :**
స్థానిక తెలుగు గంగా కాలనీలో ఉండే నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో చల్లని సాయంకాలం వేళ ఈ కిడ్జ్ పిపి2 విద్యార్థులకు మరియు ఐదవ తరగతి ఈ ఛామ్స్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ఎంతో అద్భుతంగా జరిగింది. పిపి2 విద్యార్థులు తమ విద్యాభ్యాసం ముగించుకొని ఒకటవ తరగతిలోకి ప్రవేశించే ముందు వారికి గ్రాడ్యుయేషన్ (సర్టిఫికెట్)ను ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. అలాగే ఐదవ తరగతి విద్యార్థులు తమ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని ఆరవ తరగతిలోనికి ( హైస్కూల్) ప్రవేశించడానికి అర్హులుగా గుర్తించి వారికి గ్రాడ్యుయేషన్ ( సర్టిఫికెట్) ను పాఠశాల ఏ జి ఎం శ్రీనివాసులతోపాటు ప్రిన్సిపల్ రెడ్డి ప్రవీణ్ శర్మ విద్యార్థులకు అందజేశారు. ఈ కిడ్జ్ కోఆర్డినేటర్ స్వాతి , ఈ ఛామ్స్ కోఆర్డినేటర్ ఇందిరా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించడం వలన విద్యార్థులు చిన్ననాటి నుండే గొప్ప లక్ష్యాలను నిర్ణయించుకుంటారని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ నారాయణ పాఠశాల కరిక్యులం ఎంతో అద్భుతంగా ఉంటుందని ముఖ్యంగా మైక్రో షెడ్యూల్ విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో సహకరిస్తుందని నారాయణ పాఠశాలలో చదివిన విద్యార్థులు నేడు మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రాడ్యుయేషన్ (పట్టభద్రుల సమరూప దుస్తుల్లో) చూసుకొని మురిసిపోయారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏ జి ఎం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రెడ్డి ప్రవీణ్ శర్మ, ఈ కిడ్జ్ కోఆర్డినేటర్ స్వాతి, ఈ ఛామ్స్ కోఆర్డినేటర్ ఇందిరా, అకడమిక్ డీన్ నరసింహ, వైస్ ప్రిన్సిపల్స్ రఘురామిరెడ్డి, పావని, రాజేశ్వరి, భారతి, ఏ ఓ శ్రీనివాసులు, మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను

# చిన్నచూపు చూస్తే పతనం తప్పదు

**యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా**



**రాజంపేట, మార్చి 24 ప్రభాతవార్త**
ఉద్యోగ ,ఉపాధ్యాయులను చిన్న చూపుచూస్తే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఇది చరిత్ర చెప్పే నిజమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా హెచ్చరించారు. ఉద్యోగుల పెన్షనర్ల, కార్మికుల ఆగ్రహానికి గురికాకముందే మేలుకోవాలన్నారు. రణభేరి 3.0 పోరాటంలో భాగంగా యుటిఎఫ్ నాయకులు మంగళవారం నిరాహార దీక్షను చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూహామీలు విస్మరిస్తే కూటమి ప్రభుత్వం గద్దె దిగక తప్పదన్నారు. ఆరు గ్యారెంటీ లను నెరవేర్చామని చెప్పుకునే పాలకులు మేనిఫెస్టో లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కు ఇచ్చిన హామీలు ఎందుకు అమలుచేయడంలేదని ప్రశ్నించారు. 12 వ పిఆర్సి కమిటీని నియమించి 29 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని,4 పెండింగ్ డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెమో 57 అమలు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీమ్ ను అమలు చేయాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు.చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబాల వారికి కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.హరిప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పిఆర్సి కమీషన్ వేస్తామని, ఐఅర్‌ను ప్రకటిస్తామని, డిఎలు పెండింగ్ లేకుండా చేస్తామని ఎన్నికల మేనిఫెస్టో లో ప్రకటించి ఈరోజు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణం అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోకపోవడం చాలా సోచనీయమని, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో యుటిఎఫ్ నాయకులు పి.వెంకట సుబ్బయ్య, సివి.రమణమూర్తి, కె.రమేష్ జోషి ,ఎస్.వినోద్ కుమార్, కె.శివయ్య, కె .రామచంద్ర, ఎ.చంద్రయ్యలు నిరాహార దీక్షలో కూర్చున్నారు.

# జగన్ పై షర్మిలమ్మ వ్యాఖ్యలు హాస్యాస్పదం

**మాజీ ఎమ్మెల్యే వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి**



**ప్రొద్దుటూరు మార్చి 24 ప్రభాతవార్త**
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి సోదరి షర్మిలమ్మ జగన్ పై చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దొరసానిపల్లె లోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆస్తుల విషయమై వైసీపీ అధినేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వ్యక్తిత్వ హననం చేసేలా షర్మిలమ్మ వ్యాఖ్యానిస్తోందని, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి బ్రతికున్న సమయంలోనే ఆయన ఆస్తిని జగన్, షర్మిలకు సమానంగా పంచారని, వారు కూడా దాన్ని అంగీకరించారని వివరించారు. అదేవిధంగా ఆస్తి పంపకం తర్వాత జగన్ కష్టార్జితం నుండి సంపాదించిన ఆస్తిలో షర్మిలకు కొంత ఇస్తానని ఎంఓయు చేశారని, కానీ ఆ తర్వాత ఆమె జగన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఆ ఎంఓయు రద్దు చేశారని స్పష్టం చేశారు. ఆస్తి విషయంలో జగన్ తొలుత కోర్టుకెళ్లారని మాట్లాడారని, కానీ జగన్ ఆస్తులు ఈడీకి అటాచ్ అయిన సందర్భంలో ఆయన ఆస్తులు బదిలీ చేస్తే జైలుకెళ్తారని తెలిసి బదిలీ చేయాలని షర్మిల కోర్టుకు వెళ్లిన పక్షంలో జగన్ కేవలం ఆత్మరక్షణ కోసం ట్రిబ్యునల్ ముందుకు వెళ్లారని స్పష్టం చేశారు. మొన్నటి విజయమ్మ నోటరీలో కూడా ఆమె సంతకం కాదని, అది నకిలీ కాదని తాము చెప్పలేదని తెలిపారు. అదేవిధంగా ఆమె జగన్ ను దమ్ము, ధైర్యం లేని వ్యక్తిగా అభివర్ణించారని, ఆస్తుల విషయంలో జగన్ స్పందించలేక అతని అనునయులతో మాట్లాడించారని, మాట్లాడిన వారిని ఆమె దూషించారని, అయినా బాధ లేదని, ఆమె తెలిసో తెలియకో తమను విశ్వాసానికి మారుపేరైన జంతువుతోనే పోల్చారని, తాము జగన్ కు విశ్వాస పాత్రులమని, జగన్‌ను విమర్శిస్తే తాము స్పందిస్తామని వివరించారు. జగన్ స్పందించకపోవడానికి కారణం ఆయన సంస్కారం, కుటుంబ గౌరవం, చెల్లెల పట్ల అప్యాయతే అని స్పష్టం చేశారు. తాము వైఎస్ఆర్ కుమార్తెను ఏనాటికీ దూషించలేమని స్పష్టం చేశారు. ఆమె ఈ విధంగా మాట్లాడుతూ మాట్లాడుతూ చివరికి వివేకానంద రెడ్డి హత్య విషయాన్ని తేవడం, అది భారతి రెడ్డి కి ఆపాదించడం సబబు కాదన్నారు. కేవలం ఆమె మీడియాలో ప్రచురించడం, ప్రసారం చేయడమ్ తప్పు అనిపిస్తే మిగిలిన పత్రికలు, ఛానల్స్ కూడా అదే పని చేశాయని గమనించాలన్నారు. పత్రికలు, మీడియా ఛానల్స్ కేవలం స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన కథనాలే ప్రచురిస్తాయని వివరించారు. ఆ విధంగా వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించాడని తొలుత తెలిపింది ఆయన బావమరిది శివప్రకాష్ రెడ్డి అని తెలిపారు. జగన్, భారతీ రెడ్డి వ్యక్తిత్వం హననం చేసేలా వ్యాఖ్యానిస్తే ప్రతిఘటిస్తామని తెలియజేశారు.

# రైతన్న మీకోసం కార్యక్రమం ఏర్పాటు..



**యర్రగుంట్ల మార్చి 24 ప్రభాతవార్త:**
రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే అందుకు కావలసిన సూచనలు, సలహాలు తాము అందిస్తామని కమలాపురం సహాయ వ్యవసాయ సంచారకులు ఏవి. నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం యర్రగుంట్ల లో ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులపై దృష్టి సారించాలని, తాము కూడా రైతులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు లాభసాటిగా సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## అన్నమాచార్య యూనివర్సిటీలో

# అరబిందో కంపెనీ ప్రాంగణ ఎంపికలు



అరబిందో కంపెనీకి ఎంపికైన అన్నమాచార్య ఫార్మసీ విద్యార్థులు

**రాజంపేట మార్చి 24 ప్రభాతవార్త:**
అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో మంగళవారం అరబిందో ఫార్మా కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. బి ఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థులకు ప్రొడక్షన్ ప్యాకేజింగ్ నాణ్యత నిర్ధారణ ,ఔషధ నాణ్యత పరీక్ష విభాగాలకు ఉద్యోగ అర్హతకు నియామకాలు చేపట్టారు. అరబిందో కంపెనీ నాయుడుపేట శాఖ లో ఈ ప్రాంగణ ఇంటర్వ్యూలలో ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగాలు ఇస్తారు. అరబిందో ఫార్మా కంపెనీ నియామక బృందం గణేష్ ,శ్రీనివాస్, రోహిత్, మణికంఠ లు విద్యార్థులకు వ్రాత పరీక్ష,ఇంటర్వ్యూలు, నిర్వహించారు. 104 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. స్వర్ణలత తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ సి. ఎల్లారెడ్డి అరబిందో బృందని ఆహ్వానించి తమ కళాశాలలో విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాలకు 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల నియామక అధికారి నరసింహులు , అసోసియేట్ ప్రొఫెసర్ సుస్మిత డాక్టర్ వి.సాహితీ పవన్, ద్వారకనాథ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**లక్కిరెడ్డిపల్లి మార్చి 24 ప్రభాతవార్త**
క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి లని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ శివకుమార్ దేవలంపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్యురాలు సుమలతలు పేర్కొన్నారు మంగళవారం స్థానిక మూడు రోజుల కూడలి నందు మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో టిబి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడా మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ప్రతి నెలా వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. మందులు క్రమం తప్పకుండా వేసుకునేలా సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వ అధికారులు నిక్షరు మిత్రగా చేరిభాగస్వాములవుతున్నారని, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, టిబి రహిత జిల్లాగా తీర్చు దిద్దేందుకు సహరించాలని క్షయ ఒక అంటువ్యాధి అని, రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్షయ క్రిములు గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తాయన్నారు రెండు వారాలకు మించి దగ్గు, కఫం, జ్వరం ఉండటం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, ఉమ్మిలో రక్తం పడడం మొదలకు లక్షణాల ద్వారా గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో టీవీ యూనిట్ డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ నియజ, ఎంఈఓ చక్రా నాయక్, టీవీ సూపర్వైజర్ హరి, ల్యాబ్ సూపర్వైజర్ గంగన్న, శ్రీనివాసులు పవన్, ఏఎన్ఎం లో ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు,

# పెండింగ్‌లో ఉన్న

# డీఏలను మంజూరు చేయాలి యుటిఎఫ్

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 24, ప్రభాతవార్త:**
పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యన్.నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరాహార దీక్షను ఆయన ప్రారంభించారు. ఈ నిరాహార దీక్షలో జిల్లా కౌన్సిలర్లు మురళీకృష్ణ, కంబగిరి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఓబులేసు, ముని రవీంద్ర రెడ్డి, మాధవ పాల్గొన్నారు. ప్రభుత్వంపై తమ న్యాయమైన డిమాండ్లను సాధించేందుకు ఈ పోరాటాన్ని తీవ్రతరం చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లు తెలియజేశారు. వాటిలో వెంటనే 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయడం, ఐఆర్ 29 శాతం ప్రకటించడం , పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయడం, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించడం, మెమో 57ను అమలు చేయడం వంటి తదితర అంశాలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగార్జున రెడ్డి తదితరులు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. అనంతరం ప్రొద్దుటూరు మండల తహసిల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందజేశారు.



నిరాహారదీక్షలో యుటిఎఫ్ నాయకులు

# ఎస్ఆర్ఐటీ విద్యార్థిని ప్రతిభ

**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 24, ప్రభాతవార్త:**
ఈ నెల 18వ తేదీ అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కాలేజీ అనంతపురంలో జేఎన్‌టీయూ యూనివర్శిటీ పరిధిలో జరిగిన ఖోఖో సెలక్షన్ ట్రైల్స్‌లో సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థిని ప్రశాంతి ఎంపికై ఏప్రిల్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు కర్ణాటక దావణగిరి యూనివర్శిటీలో జరగనున్న అంతర్ యూనివర్శిటీలో ఖోఖో పోటీలలో పాల్గొంటుందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. క్రీడలలో ప్రతిభ చాటిన విద్యార్థిని చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటేశ్వరరెడ్డి, పీడీ మహబూబ్ బాషా, హెచ్ఓడీలు అభినందించారు.

# శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలి

**- కడప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి**



**పెండ్లిమర్రి, మార్చి 24, ప్రభాతవార్త:**
పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలో ఎగువపల్లె జడ్పీ హైస్కూలు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను గత 2 రోజులుగా జరుగుతున్న బూట్ క్యాంప్‌లో భాగంగా ఆయన జిల్లా సైన్స్ అధికారి ఎబెనెజర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో ఆసక్తికరమైన పలు విజ్ఞానశాస్త్ర పరికరాలు, ప్రయోగాలు, భావనల గురించి ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులతో సమావేశమై పిల్లల హాజరు మరియు విద్యా ప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఆంగ్లోపాధ్యాయులు గునిశెట్టి శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, పుష్పలత, హిందీ బోధకుడు యఫ్‌యంఎస్ ఖాదర్, రవి, శివజ్యోతి, మమత తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

**టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**

**రాజంపేట, మార్చి 24 ప్రభాతవార్త**
పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి మారిందని, ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తోందని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 1.15 కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అంతేకాకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా పేదలు ఆరోగ్య సేవలు పొందవచ్చని వారికైనా ఖర్చులు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పొందవచ్చన్నారు. పేదలకు ఎటువంటి సమస్య వచ్చినా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పందిస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు,నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ నవీన్, తుపాకుల అశోక్ కుమార్, పార్టీ గ్రామీణ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్, రాంనగర్ నరసింహ, సతీష్ రాజు, పాండురాజు, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

**ఒంటిమిట్ట మార్చి.24. ప్రభాతవార్త**
కడప జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ఒంటిమిట్టలో మంగళవారం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై, ట్రాఫిక్ నిబంధనలపై ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది హ్యాపీ కిడ్స్ విద్యార్థులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే రావడం జరిగింది. ఈ సందర్భంగా ఏ ఎస్ పి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న కాల పరిస్థితుల దృష్ట్యా సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని వాటిని నిర్మూలించి మహిళలకు రక్షణ కల్పించడమే ప్రతి ఒక్కరూ లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వేగం కన్నా ప్రాణం విలువైందని వాహనాల్లో ప్రయాణించేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ జాగ్రత్త వహించాలన్నారు. ద్విచక్ర వాహన దారులు వాహనాల్లో వెళ్లేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. రికార్డులు తప్పని సరిగా పెట్టుకోవాలన్నారు. వేధింపులు మహిళల రక్షణకు చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు ఫైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా ఫైబర్ నేరాలకు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లయితే ప్రభుత్వపరంగా కఠిన శిక్షలు ఉంటాయని హితువు పలికారు. కావున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలతో భావాలతో విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకుని విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు కని,పెంచిన తల్లిదండ్రులకు, పుట్టిన గడ్డకు మంచి కీర్తి ప్రతిష్టలు సంపాదించి పెట్టి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిపోవడంతో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని ఆ ఉచ్చులో పడవద్దన్నారు. చేసే ప్రతి పని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ నుంచి దర్జీపల్లి క్రాస్ వరకు ర్యాలీ కొనసాగింది. మానవహారం నిర్మించి రోడ్డు భద్రతపై ప్లాస్టిక్ వాడకంపై కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. హ్యాపీ కిడ్స్ విద్యార్థులు లగునాటిక ప్రదర్శించగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సిద్ధవటం ఎస్సై హారిక, మండల ప్రజలు తదితర పోలీసు సిబ్బంది ఉన్నారు.



